క్లుప్తంగా

సర్వీస్ రోడ్డులో నిలిచిన వర్షంనీరు


రోడ్డుపై నీరు నిలిచిపోవటంతో ప్రయాణికుల పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ పరిధి నవభారత్ ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డులో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. ఫ్లైఓవర్ నుంచి వర్షంనీరు సర్వీస్ రోడ్డు పైకి రావటం, డ్రైనేజీ సక్రమంగా లేకపోవటంతో వరదనీరు నిలిచిపోతుంది. పక్కనే నారాయణపురం కుడి కాలువ ఉన్నా వరదనీరు పూర్తిస్థాయిలో వెళ్లే అవకాశం లేదు. ఈ రోడ్డుపై శ్రీకాకుళం పట్టణం నుంచి వచ్చేవారు, శ్రీకాకుళం పట్టణం వైపు వెళ్లేవారు రాకపోకలు సాగిస్తున్నారు. నిరు నిలిచిపోవటంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

నేడు రక్తదాన శిబిరం

రణస్థలం: మహా మాధురి చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు దువ్వాన అప్పలసూరి, దండాశి జాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు లావేరు మండలంలోని గురుగుబిల్లి క్రికెట్ గ్రౌండ్ వేదికలో శిబిరం ఉంటుందన్నారు. రక్తదానం చేసి.. ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు కామేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ, జిల్లాపరిషత్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సమగ్రశిక్షా వర్క్, ఆర్ట్, వ్యాయామం విద్య ఉపాధ్యాయులు తమకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇల్లీసుపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో జిల్లాస్థాయిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు గుడివాడ కామేశ్వరరావు, అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లోపింటి దిలీప్, ఉపాధ్యక్షులు చిగిలిపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. అరకొర వేతనాలతో పని చేస్తున్న తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకున్నారు. ఉద్యోగ భద్రత కల్పించి జీతాలను పెంచాలన్నారు. సంఘ కోశాధికారి పందిరి తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీకి జర్నలిస్టుల వినతి


ఎస్పీ రాధికకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్: జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని జర్నలిస్టుల సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధికను తన కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ సాయంకాలం పత్రికకు చెందిన బానూరు సాయిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీని కలిసిన వారిలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఏపీజేఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జోగినాయుడు, నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల శంకరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ అర్బన్ యూనిట్ అధ్యక్షులు ఎస్.విజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావులు ఉన్నారు.

జనార్దనరావు నేత్రాలు సజీవం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నానుబాల వీధిలో నివాసం ఉంటున్న అంధవరపు జనార్దనరావు(46) అనారోగ్య కారణాలతో శనివారం మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు అంధవరపు మానస, పి.మణికంఠ, కె.అచ్యుతరావులు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్‌లు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.

అప్రమత్తతే ఔషధం

- వర్షాకాలంలో ప్రాణాంతక వ్యాధులు
- మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధులు


అల్లినగరం వద్ద మేత మేస్తున్న గొర్రెలు

నియోజకవర్గంలోని గొర్రెలు, మేకల వివరాలు..

మండలం	గొర్రెలు	మేకలు
ఎచ్చెర్ల	12,940	3,942
జి.సిగడాం	18,420	2,940
లావేరు	34,200	6,000
రణస్థలం	52,340	4,500

ఎచ్చెర్ల: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశువులు వ్యాధుల బారిన పడుతుండడంతో పాడి రైతులు అనేక వ్యయప్రయాసాలకు గురికావాల్సి వస్తుంది. వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగులు, బావుల్లో నీరు చేరి కలుషితమవుతుంటాయి. కలుషితనీరు తీసుకోవడంతో పశువులకు వివిధ వ్యాధులు సోకే ప్రమాదముంది. ప్రధానంగా మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తిచెందే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. వ్యాధుల బారిన పడకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

వ్యాధుల వ్యాప్తి ఇలా..

మేతకు వెళ్లే మేకలు, గొర్రెలు మందలు వర్షాకాలంలో తడవడం, మురికి గుంటలు నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండడం వల్ల సూక్ష్మ జీవులు వాటి కాళ్లను ఆశించడంతో వ్యాధి బారిన పడతాయి. చిత్తడి నేలల్లో తిరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీన్ని ముందుగా గుర్తించకుంటే మేక, గొర్రెకు వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత కాపరులు పశు వైద్యులను సంప్రదించాలి.

వ్యాధి లక్షణాలు..

కాలి పుండు సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనుకబడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలిపుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు, బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. తీవ్రమైన చెడువాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం సైతం ఉంటుంది. ఈ తరహా వ్యాధి లక్షణాలు మేకలు, గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వైద్యుల సూచనలు మేరకు మందులను దాదాపు నెల రోజుల వరకు వాడాలి. అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి.

వర్షాకాలంలో కాళ్లకు పుండ్లు



ప్రతీ వర్షాకాలంలో గొర్రెలకు, మేకలకు కాళ్లకు పండ్లు పుడుతుంటాయి. వీటి వల్ల చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నడవలేని పరిస్థిలో నీరసించి పోతున్నాయి. మేత మేయవు. వర్షాకాలంలో పాడి నేలలు దొరకడం కష్టంగా ఉంటుంది. ఒక జీవికి పుండు పుడితే మంద మొత్తానికి సోకుతుంది.

– యద్ల మల్లేసు, గొర్రెల కాపరి, అల్లినగరం

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మేకలు, గొర్రెల్లో కలిపుండు వ్యాధి వ్యాప్తిచెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. మందలను చిత్తడి, నీరు నిల్వ ఉండే నేలలకు దూరంగా ఉంచాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు మేరకు మందులు వేయాలి.

– డాక్టర్ కె.రమణ, పశువైద్యాధికారి, ఎచ్చెర్ల

ప్రజల పక్షాన పోరాడతాం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


కిరణ్‌కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ శ్రేణులు

రణస్థలం: ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజల పక్షాన పోరాడతామని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కిరణ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. తల్లికి వందనం పథకంపై తెలుగుదేశం కుటమి ప్రభుత్వం దగా చేస్తుందని, రోజుకోక సంక్షేమ పథకంలో చేర్పులు, మార్పులు చేసి ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ప్రజా పక్షాన పోరాడుతు వస్తోందన్నారు. 40 శాతం ఓటు బ్యాంక్ ఉన్న వైఎస్సార్‌సీపీ ఎవరికీ భయపడే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్, నాలుగు మండలాల నాయకుల, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు శనివారం నిర్వహించారు. రణస్థలంలోని ఎమ్మెల్యే కార్యాలయానికి కొంతమంది నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. కుశాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకన్నగారి శ్రీను బైపాస్, నవభారత్ కూడళ్లల్లో పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.

పాతర్లపల్లిలో..

రణస్థలం: ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు పాతర్లపల్లిలోని ఎస్సీ కాలనీ వాసులు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. పాతర్లపల్లి అభివృద్ధిలో భాగమైన దళితులకు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, ఎస్సీ కాలనీ వాసులు, యువకులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌పై కేసు రాజకీయ కక్ష సాధింపే..

- మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షకు పాల్పడుతుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మండిపడ్డారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజును అడ్డంపెట్టుకుని జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమంగా కేసు పెట్టారన్నారు. మూడేళ్ల తర్వాత సీనియర్ ఐపీఎస్‌లతోపాటు, జగన్‌పై, డాక్టర్‌పైనా కేసు నమోదు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర పోలీసులు ఓ కొత్త సంప్రదాయానికి తెర తీశారన్నారు. భవిష్యత్‌లో వారికే ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇంతకన్నా తప్పుడు కేసు మరొకటి ఉండదన్నారు. రఘురామకృష్ణరాజు జూన్ 11న ఈ మెయిల్ ద్వారా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తే.. అంతకు ముందురోజే జూన్ 10న పోలీసులు లీగల్ ఒపిని యన్ ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. ఫిర్యాదు రిపోర్టు రాక ముందే లీగల్ ఒపీనియన్‌కు ఎలా రాశారని, దీనికి సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు.

సత్యన్నారాయణమూర్తి కుటుంబానికి పరామర్శ


కొన్న వాసు, ఇతర కుటుంబ సభ్యులతో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పట్టణానికి చెందిన కొన్న సత్యన్నారాయణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను పలువురు నాయకులు, ప్రముఖులు శనివారం పరామర్శించారు. శ్రీకాకుళం నగరంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు పరామర్శించారు. సత్యన్నారాయణమూర్తి సోదరులు వెంకటేశ్వరరావు (వాసు), మధుసూదనరావులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రత్నాల నరసింహమూర్తి, కొంక్యాన ఆదినారాయణ, అప్పలరాజు, సనపల అప్పలనాయుడు, రామినాయుడు, కొంక్యాన సుభాష్, వేణు, మురళి, టంకాల బాలకృష్ణ, ఎస్.విజయ్‌కుమార్, పాలకొండ అప్పారావు, ఎం.సాంబమూర్తి, బాలాదిత్య, రాష్ట్ర, జిల్లా అథ్లెటిక్స్ సంఘ నాయకులు, పీడీలు ఉన్నారు.

పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 550 కంటే ఎక్కువ మార్కులు సాధించిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన బాలబాలికలకు ప్రతిభా పురస్కారాలను డాక్టర్ రేఖల మల్లేశ్వరరావు చేతులమీదుగా అందించారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోమ్‌లో పద్మశాలి సంఘం అధ్యక్షులు పసగాడ రామకృష్ణ అధ్యక్షతన శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. చదువులో మంచి ఫలితాలు సాధించిన వారిని ప్రోత్సహించేందుకు సంఘం తరపున ఒక్కో విద్యార్థికి వెయ్యి రూపాయల నగదు, మెమెంటో, ప్రసంశాపత్రం అందించామన్నారు. పిల్లలంతా బాగా చదువుకుని మంచి ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.వి.రమణ, యోసో శ్రీనివాసులు, ఎం.దాలన్న, పి.వి. కూర్మేశ్వరరావు, ఇమంది విశ్వేశ్వరరావు, ప్రసాదరావు, పందిరి చిన్నారావు, పి.నర్సింగరావు, వి.చంద్రమౌళి, నూలు నారాయణరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థులు ఎంపిక


సింగూరు జ్యోత్స్న

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని హయాతీ నగరంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎల్.మనీషా, బి.స్నేహ, జి.మౌనిక, ఎస్.తేజేశ్వరి, ఎస్.ప్రవంతి, పి.చందన ఉన్నారు. వీరందరికీ శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల క్యాంపస్‌లో సీట్లు లభించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. పాఠశాల నుంచి రికార్డుస్థాయిలో ఆరుగురు విద్యార్థిను ఎంపిక కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినులను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. అలాగే శ్రీకాకుళం నగరంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సింగూరు జోష్ణ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. టెస్ట్ పరీక్షల్లో ఈమె 567 మార్కులు సాధించింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. జ్యోత్న్స ప్రధానోపాధ్యాయులు బలివాడ భాస్కరరావు, ఉపాధ్యాయులు సదాశివుని శంకరరావు, ఎ.చిన్నవాడు, కె.వి. రమణ, పి.రమణకుమారి, టి.శ్రీపూర్ణిమ, పైడి భాగ్యలక్ష్మి, కె.చంద్రకళ అభినందించారు.

గణాంకశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


పురుషోత్తమనాయుడుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: గణాంకశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ స్టాటిస్టికల్ సబార్డినేట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.సుధాకర్, కార్యదర్శి బి.జి.మనోహరరావు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడును శనివారం కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో సగం మండలాలకు పైగా మండల సహాయ గణాంకాధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉప గణాంకాధికారి పోస్టులను గజిటెడ్ హోదా కల్పించాలనే ప్రయత్నం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని, ఈ సమస్య పరిష్కారం చేసే దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పురుషోత్తమనాయుడును కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, పి.బాలరాజు, ఎన్.శేఖర్‌బాబు, బి.గోవింద్, పి.అప్పలనాయుడు, వై.జోగారావు, పి.గణపతిరావు ఉన్నారు

కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కింతలిమిల్లు జంక్షన్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలను నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కళాకారులకు సత్కారం


కళాకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: వర్తమానానికి ప్రతి రూపంగా కళారంగం నిలుస్తుందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిరంలో జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాలు స్వర నీరాజనం కార్యక్రమం శనివారం జరిగింది. జిల్లాలోని కళాకారులందరినీ ఒక దగ్గరికి చేర్చే ఉద్దేశంతో ఈ సంఘం నడుస్తోందని సంఘ అధ్యక్షులు బొడ్డేపల్లి శివశంకర్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి దాతల సహాయ సహకారాలు ఉన్నాయని అన్నారు. అలాగే బాలు పురస్కారాలను మిమిక్రీ కళాకారులు ఎల్.నందికేశ్వరరావుకు, శాక్సోఫోన్ కళాకారులు తాడివలస కొండలరావుకు, ఆర్కెస్ట్రా నిర్వాహకులు చింతల ఆదినారాయణ, గాయకులు కె.ఎల్.ఎన్.మూర్తి, పౌరాణిక కళాకారులు మజ్జి మోహనరావుకు అందించారు. పలువురు గాయకులు బాలూ గీతాలను ఆలపించారు. దివ్యాంగుల కళాకారుల నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా వందమంది కళాకారులకు నిత్యావరస సరుకులను ఎమ్మెల్యే గొండు శంకర్, అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, కూన అనీల్‌కుమార్. సింహాద్రి శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, కుప్పిలి భానుమతి, చిట్టూరు దామోదరరావు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించాలని విజ్ఞప్తి

గార: కళింగపట్నం మెయిన్‌రోడ్‌లో సంతతోట వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టి, వ్యర్థాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. స్థానిక పీహెచ్‌సీకి సమీపంలోనే ఖాళీ బొండాలు కుప్పలుగా పడి ఉన్నాయి. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బొండాలు తొలగించాలని ఆదేశించినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపడతామని ఈవోపీఆర్‌డీ బి.శ్రీనివాసరావు తెలిపారు.

వేంకటేశ్వరునికి పూజలు


నారాయణ తిరుమలలో పూజలందుకున్న వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్:

పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. వెంకట రామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అలాగే చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామికి, మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామికి, డీసీసీబీ కాలనీలోని భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా పూజలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగన్నాథుడికి ప్రత్యేక పూజలు


పాండురంగ వీధిలో వేంకటేశ్వరునిగా..


గుజరాతిపేటలో కూర్మనాథునిగా స్వామివారు


ఇల్లీసుపురంలో రామావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు


మొండేటివీధిలో వేంకటేశ్వరుని అవతారంలో జగన్నాథుడు

శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శనివారం సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జగన్నాథుడు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఇల్లీసుపురం కూడలిలోని జగన్నాతస్వామిని రామావతారంలో అలంకరించారు. సుభద్ర, బలభద్రులతో పాటుగా జగన్నాథస్వామిని అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. గుజరాతీపేటలోని జగన్నాథస్వామి వారిని కూర్మావతారంలో అర్చకులకు అలంకరించారు. పాండ్రంగ వీధిలో ఉన్న శ్రీరామమందిరంలో జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా స్వామి వారు వేంకటేశ్వరస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మొండేటి వీధిలోని షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో లలితా సహిత శివకామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని వేంకటేశ్వరస్వామిగా అలంకరించగా..భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

అపూర్వమైన ప్రక్రియ అవధానం


అవధాన ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అపూర్వమైన ప్రక్రియ అవధానమని, అది తీర్థం లాంటిదని తిరుపతికి చెందిన అవధాని ఆముదాల మురళీ అన్నారు. స్థానిక అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో వైజయంతి ఉత్సవ మండపంలో ఆరవెల్లి లక్ష్మీనారాయణ వేదికలో ద్విశతావధాన కళావిలాస కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమిత్రా కళా సమితి చక్కనైన కార్యక్రమం చేపట్టారని అన్నారు. ఎంతో మంది అవధానులు ఈ ప్రక్రియను చేసి పేరుప్రఖ్యాతలు సాధించారని వ్యాఖ్యానించారు. సభా సంచాలకులుగా విశాఖకు చెందిన డాక్టర్ పేరి రవికుమార్ వ్యవహరించారు. అప్రస్తుత ప్రసంగికులుగా విజయవాడకు చెందిన పంతులు తపస్వి, దండిభోట్ల దత్తాత్రేయ శర్మలు అవధానికి పలు అప్రస్తుత సమస్యలను అడిగి సమాధానాలు చెప్పమని కోరారు. శనివారం 13 దత్తపదులు, 25 వర్ణనలు, 5 ఆసువులు, రెండో ఆవృతంలోని దత్తపదులను, వర్ణనలను అవధాని బులుసు అపర్ణ పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ పులంఖడం శ్రీనివాసరావు, బంకుపల్లి రమేశ్‌శర్మ, మండవిల్లి రవి, చిన్నారావు, నక్క శంకరరావు, రంపా సాయికుమార్, బంకుపల్లి శంకరం, పూజ, వరలక్ష్మి పాల్గొన్నారు.

భూమి కావలెను
శ్రీకాకుళం పట్టణంలో గాని, పట్టణ పరిసర ప్రాంతంలో గాని 4 ఎకరముల భూమి అమ్మకానికి సిద్ధంగా ఉన్నవారు మా ఈ ఫోన్ నెంబరుకు సంప్రదించగలరు.
8143135981

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com